
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

గురువారం 11 ఏప్రిల్ 2024



- జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సర్వే
- ఒక్కో గ్రామం నుంచి 30 నమూనాల సేకరణ
- ఇప్పటికే సాల్ట్ టెస్టింగ్ కిట్‌ల అందజేత
- జిల్లా వ్యాప్తంగా 2,700 నమూనాలు

మీ ఉప్పులో అయోడిన్ ఉందా?



వచ్చే సమస్యలివే..

గొంతులోని థైరాయిడ్ గ్రంధికి వాపు వస్తుంది. నిర్ణీత పరిమాణంలో అయోడిన్ శరీరానికి అందకుంటే థైరాక్సిన్ హార్మోన్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటుచేసుకుంటాయి. దీంతో గర్భిణీలకు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. మానసిక సమస్యలు ముప్పు వాటిల్లే అవకాశాలున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. నరాల జబ్బులు, పిల్లల ఎదుగుదలలో లోపాలు, చలాకీతనం తగ్గడం, దృష్టి లోపం, బరువులో హెచ్చు తగ్గుల ప్రమాదం రావచ్చని వైద్యులు వివరిస్తున్నారు.

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపంతో వ్యాధుల బారిన పడే చిన్నారులను, ఇతరులను గుర్తించి నివారణ చర్యలు చేప ట్టేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మెజార్టీ ప్రజల్లో అయోడిన్ లోపం ఉన్నట్లు ఆరోగ్య శాఖ అం చనా వేసింది. ఆహారంలో సరియైన ఉప్పు లేకపోవడం, తక్కువ అయో డిన్‌తో కలిగిన ఉప్పును తినడం వలన అయోడిన్ లోపం ఏర్పడుతున్నట్లు గుర్తిస్తున్నారు. అయితే మాంసాహారులతో పోలిస్తే శాఖా హారులకే ఎక్కువ అయోడిన్ లోపం ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. దీనితోనే థైరాయిడ్ తీవ్రత పెరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కుటుంబ ఆరోగ్య శాఖ సూచన మేరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) జిల్లాలోని అన్ని గ్రామాలలో అయోడిన్ క్యాంపులను నిర్వహించాలని భావిస్తున్నారు. దీనిలో భాగంగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అయోడిన్ సర్వేను చురుకుగా నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో అయోడిన్ లోపంపై అవగాహన కలిగించడంతో పాటు థైరాయిడ్ స్క్రీనింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలువురు అయోడిన్ లోపంతో బాధపడుతున్నట్లు తేలింది. ఈ సర్వే మేరకు కేంద్ర వైద్యశాఖ జిల్లాలోని నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ, డిజార్డర్ కంట్రోల్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని చేపట్టాలన్న యోచన చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో వినియోగిస్తున్న ఉప్పులో అయోడిన్ ఎంత మేర ఉందో.. పరీక్షించడానికి సాల్ట్ టెస్టింగ్ కిట్‌లను ఆశా కార్యకర్తలకు అందజేశారు.

జిల్లాలో చురుకుగా సర్వే

జిల్లాలో నెలకు 30 గ్రామాల చొప్పున అయోడిన్ సర్వే చురుకుగా జరుగుతోంది. ఇందులో 20 గ్రామాల్లో, 10 పట్టణాల్లో సర్వే చేస్తున్నారు. ఇళ్లలో, దుకాణాల్లో సర్వే జరుపుతున్నారు. ఒక్కో గ్రామం నుంచి 90 నమూనాలను సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,700 నమూనాలను సేకరించనున్నారు. వీటిని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలువురు అయోడిన్ లోపం ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా 6 నుంచి 12 సంవత్సరాల్లోపు చిన్నారుల్లో అయోడిన్ లోపాన్ని పరీ క్షిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆశా కార్యకర్తలు

జిల్లాలో సుమారు వంద మంది ఆశా కార్యకర్తల ద్వారా అయోడిన్ సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఆశాకార్యకర్తలు అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా కుటుంబాల్లో ఎవరైనా వ్యాధుల బారిన పడిన వారుంటే... అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతలుగా అనుమానం వస్తే వారు వినియోగించే ఉప్పును సేకరించి అక్కడికక్కడే నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఉప్పులో నిర్ణీత ప్రమాణాల మేరకు అయోడిన్ లేకుంటే ఆ ఉప్పును కేంద్ర ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయిస్తున్నారు. అయోడిన్ లోపం ఉన్నట్లు తేలితే వెంటనే వారికి మిశ్రమ ఉప్పును వాడేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు వాడే ఉప్పులో అయోడిన్ విధిగా 15 పీపీఎం ఉండాలని వైద్యులు అంటున్నారు. రోజూ మనం చేసే భోజనం ద్వారా అయోడిన్ శరీరానికి అందాలని, అంతకన్నా తక్కువగా ఉంటే పలు రకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

అప్రమత్తతతో నివారణ..

అయోడిన్ లోపానికి గురయితే థైరాయిడ్ గ్రంధి వాపు వచ్చి పెద్ద కణితిలా మారుతుంది. అయోడిన్ లోపం మలబద్ధకానికి కూడా దారితీస్తుంది. కొద్ది దూరం నడిచినా, బరువులు ఎత్తినా వెంటనే అలసిపోతారు. ఏ కారణం లేకుండా మానసిక ఆందోళనకు గురవుతున్నట్లయితే తప్పకుండా వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. గర్భవతులు రోజువారి ఆహారంలో అయోడిత్ తగిన మోతాదులో ఉంచుకోవాలి. అయోడిన్ లోపం వల్ల శరీర బరువు ఆకస్మాత్తుగా పెరగవచ్చు.

జిల్లా వ్యాప్తంగా అయోడిన్ సర్వే

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, జగిత్యాల



జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు, పట్టణాల్లో అయోడిన్‌పై సర్వే చేస్తున్నాం. అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని ప్రజల్లో చైతన్యం తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నాం. మోతాదుకు మించి వాడినా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్న కిట్ ద్వారా వినియోగిస్తున్న ఉప్పును పరీక్ష చేయించుకోవాలి.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు పరీక్ష

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోలి శ్రీలత తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన, మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో టీజీఆర్డిసెట్ పరీక్ష ఆంగ్లమాధ్యమంలో ప్రవేశం కోసం ఏప్రిల్ 12వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లపై వీడియోకాన్ఫరెన్స్



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరాఫరా, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర్‌లు హాజరయ్యారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. వివిధ అంశాలపై అధికారులకు సీఎస్ శాంతికుమారి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలి

కథలాపూర్, ఏప్రిల్ 10: నీటి కొరత ఉన్న చోట గ్రామాల్లోని నీటి ట్యాంకులను అద్దె బోర్లతో నింపి ప్రజలకు సరఫరా చేయాలని ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ ప్రవీణ్ సూచించారు. బుధవారం మండలంలోని అంబారిపేట, కథలాపూర్ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు సంబంధించి తలెత్తుతున్న సమస్యలను పరిశీలించారు. వచ్చే మూడు మాసాల్లో తాగునీటి ఇబ్బందులు పెరగడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు కొంత జాప్యం ఏర్పడుతున్న కారణంగా బోర్లను రైతుల నుంచి అద్దెకు తీసుకుని ట్యాంకులకు నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా, పైపులైన్లు లీకేజీ లేకుండా చూసుకోవాలని కోరారు.

హద్దు రాళ్లను తొలగించిన పంచాయతీ సిబ్బంది

కొడిమ్యాల, ఏప్రిల్ 10 : మండలంలోని నాచుపల్లి గ్రామ శివారులోని 216 సర్వే నెంబరు గల భూమిలో లేఅవుట్ పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలిగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రాళ్లను తొలిగించామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి లే అవుట్ అనుమతి లేకుండా ఏర్పాటు చేసే ప్లాట్లను అమ్మరాదని, కొనరాదని తెలిపారు. లే అవుట్ లేని ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలకు గ్రామ పంచాయతీ అనుమతి ఇవ్వదన్నారు. లేఅవుట్‌లేని ప్లాట్లను అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటామన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 10: కుష్టు వ్యాధిపై ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తే వీలైనంత వరకు నిర్మూలించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. మండలంలో గత కొన్ని రోజుల నుంచి నిర్వహించిన సర్వేలో 34 మంది అనుమానితులను గుర్తించగా వారిని ఆయన పరిశీలించి ముగ్గురికి వ్యాధికి సంబంధించిన తదిపరి పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని, రాగి రంగు మచ్చలు ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉంటుందని, మొదటి దశలో ఉన్నప్పుడే చికిత్స పొందలన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు ఎలాంటి అనుమానాలు అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఇది పూర్తిగా మందుల ద్వారా కానీ, మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా నయమయ్యే వ్యాధి అని అన్నారు.



జగ్గసాగర్ పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి : జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో రాయికల్ మండలం రామోజీపేటకు చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ, వివిధ కుల సంఘాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



కండువా కప్పి పార్టీలోకి చేర్చుకుంటున్న జీవన్‌రెడ్డి

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పరామర్శించిన కేసీఆర్



నివాళులర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్



హనుమంతరావుకు నివాళులర్పిస్తున్న జీవన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పితృవియోగం పొందిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్‌ను మాజీ సీఎం, గులాబీ దళపతి కేసీఆర్ పరామర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తండ్రి, ప్రముఖ న్యాయవాది మాకునూరి హనుమంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం జగిత్యాల పట్టణంలోని విరూపాక్షి గార్డెన్‌లో స్వర్గ పాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో వచ్చిన కేసీఆర్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద గల హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన విరూపాక్షి గార్డెన్‌కు చేరుకున్నారు. దివంగత హనుమంత రావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. అక్కడి నుంచి హెలిప్యాడ్ వరకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయన వెంట మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, రాజేశం గౌడ్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

పలువురు ప్రముఖుల పరామర్శ

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తండ్రి హనుమంతరావు స్వర్గ పాత్ర కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, మాజీ మేయర్ రవీందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

- ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల నివాసంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి పరామర్శించారు. హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి

రాయికల్, ఏప్రిల్ 10: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికలో బుధవారం మండలంలోని విత్తన డీలర్లు, దుకాణదారులతో వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వాణి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడే రైతులు ఉన్నారని, నాణ్యమైన విత్తనాలను తీసుకురావాలని, విత్తన చట్టం, ఎరువుల నియంత్రణ చట్టం ప్రతి ఏవో పరిధిలో ఉంటుందన్నారు. డీలర్లకు సంబంధించిన సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ స్టాక్ రిజిష్టర్లు షాపుల్లో తప్పనిసరిగా ఉపయోగించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31 వరకు స్టాక్ రిజిష్టర్ మెయింటనెన్స్ చేయాలన్నారు. ఏవో ముక్తేశ్వర్, రాయికల్ మండల డీలర్లు పాల్గొన్నారు.

సభ్యుల గైర్హాజరు.. సర్వసభ్య సమావేశం వాయిదా

మల్యాల, ఏప్రిల్ 10: మల్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఈ నెల 2న ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం నెగ్గడంతో ఈ సమావేశంకు అధ్యక్షత వహించాల్సిన ఎంపీపీ హాజరు కాలేదు. అయితే సభ్యులు కూడా గైర్హాజరు కాగా కొద్ది మంది అధికారులు మాత్రమే వచ్చారు. దీంతో గంట సేపు వేచి చూసిన అనంతరం సమావేశం వాయిదా వేస్తున్న ఎంపీడీవో స్వాతి ప్రకటించారు. అవిశ్వాసం అయ్యిక ఎంపీపీని తొలగించినట్లు బుధవారం వరకు ఉత్తర్వులు రాకపోవడం, అదే రోజు సమావేశం ఉండడంతో ఎంపీపీ విమల హాజరు అవుతారని భావించారు. అయితే మధ్యాహ్నం వరకు ఎంపీపీ పదవి నుంచి తొలగిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. తొలగించిన ఎంపీపీ స్థానంలో ఎంపీపీ ఎన్నిక వరకు వైస్ ఎంపీపీకి ఇన్‌చార్జీగా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది.

- ఎంపీపీ పదవి నుంచి విమల తొలగింపు

మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2 జరిగిన ఎంపీపీ అవిశ్వాస సమావేశంలో 9మంది సభ్యులు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించడంతో జగిత్యాల ఆర్డీవో ప్రభుత్వానికి నివేదించారు. దీంతో తొమ్మిది రోజుల అనంతరం ఎంపీపీని పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు రావడంతో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదు. సభ్యులు కూడా హాజరుకాకపోవడం చర్చణీయాంశంగా మారింది. అవిశ్వాస ప్రక్రియ సక్రమంగా లేదనే దానిపై కోర్టుకు వెళ్లనున్నట్లు విమల తెలిపారు.



సభ్యుల గైర్హాజరుతో వెలవెలబోతున్న సమావేశం

పిచ్చి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో హనుమాన్‌నగర్, మెయిన్ రోడ్‌పై బుధవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. దారి వెంట వెళ్లే వారిపై పిచ్చి కుక్కలు దాడికి తెగబడ్డాయి. ఎక్క డ పడితే అక్కడ దాడి చేస్తూ గాయపర్చడంతో భయంతో పరుగులు తీశారు. హనుమాన్‌నగర్‌లో నలుగురిపై, మెయిన్‌రోడ్‌పై మరో నలుగురుపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. అబ్దుల్లా, ఆరీఫ్, షాదుల్, అజ్నాన్‌తో పాటు మరో నలుగురిని పిచ్చి కుక్కలు గాయపర్చాయి. గాయ పడ్డ వారిలో నలుగురు మహిళలు ఉన్నారు. వీరందరిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూఆక్రమణ కేసులో ధరణి మాజీ కో ఆర్డినేటర్ బుచ్చిరాజు అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న కరీంనగర్ కలెక్టరేట్‌లో ధరణి మాజీ కోఆర్డినేటర్ భగత్‌నగర్‌కు చెందిన ఎల్లంకి బుచ్చిరాజును కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌లో నకిలీ ధ్రువపత్రాలతో భూ ఆక్రమణకు పాల్పడినట్లు బాధితుడు బొంతల రఘు ఫిర్యాదుతో కొత్తపల్లి ఠాణాలో ఇదివరకే మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో సహా 12 మందిపై కేసు నమోదైంది. కాగా అప్పుడు తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మిగతా 9 మందిలో ఏ12 నిందితుడిగా ఉన్న ఎల్లంకి బుచ్చిరాజును బుధవారం అరెస్టు చేశారు. బుచ్చిరాజు గతంలో కలెక్టరేట్‌లో ధరణి కో ఆర్డినేటర్‌గా పనిచేశాడని, తహసీల్దార్‌కు సహకరించాడని సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వీర్నపల్లి, ఏప్రిల్ 10: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు ఎక్కడున్నా పట్టేస్తున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో పెద్దమ్మ ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన బొజ్జ కనకరాజు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పరిజ్ఞానంతో పోలీసులు పట్టుకున్నారు. ఫోన్‌ను బుధవారం ఏఎస్ఐ రాజిరెడ్డి బాధితుడికి అందజేశారు.

ఎండవేడికి చెరువులోని చేపలు మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని మర్రిపల్లిలోని చెరువులో ఎండ వేడిమిని తట్టుకోలేక చేపలు మృతి చెంది బుధవారం ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. చెరువును ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటేష్ కుమార్, కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము, రేగుల మల్లికార్జున్, రేగుల రాజేశం, మర్రిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పండుగ మల్లేశం, సభ్యులు పరిశీలించారు.

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు, సీనియర్ న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్, హ్యూమన్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియామకం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ న్యాయవాది, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్‌కు పదవి రావటంపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు తన శక్తివంచ లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావటంలో కీలకంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్
- అల్లీపూర్ గురుకుల పాఠశాలలో విచారణ

రాయికల్, ఏప్రిల్ 10: గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గురుకుల పాఠశాలల రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ మహాత్మ బాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన విద్యార్థుల ఘర్షణపై గురుకుల పాఠశాలల కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ బుధవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో గౌతమ్ మాట్లాడుతూ గురుకులంలో చదివే విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటారని, బాత్‌రూమ్‌కు వెళ్లే సందర్భంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో విద్యార్థి గాయపడినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థి పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలియజేయక పోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆశ్రయించి ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఉగాది సందర్భంగా సెలవు కావడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు దశలవారీగా విధులు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థి గాయపడిన విషయం ఉపాధ్యాయులకు తెలుపకపోవడం వల్లే తల్లిదండ్రులు ఆగ్రహించారన్నారు. ఈ ఘటనలో విద్యార్థిపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించామని, పద్ధతి మార్చుకోకపోతే రానున్న అకాడమిక్ సంవత్సరంలో వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సెలవు దినాల్లో ఒకరికి అదనంగా మరొక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందివ్వడంతో పాటు వైద్యులకు సంప్రదించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

మెడికల్ కళాశాల నిర్మాణాలను అడ్డుకున్న రైతులు

- నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్
- రైతులపై దాడి చేసిన కాంట్రాక్టర్
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- ఫిర్యాదు చేసిన రైతులు



కళాశాల భవన నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: నష్ట పరిహారం ఇవ్వకుండానే నమ్మించి మోసం చేసి మెడికల్ కళాశాలను నిర్మించారని నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టాలంటూ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మెడికల్ కళాశాల వద్ద పనులను మూడు రోజుల నుంచి రైతులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కాంట్రాక్టర్ దగ్గరుండి పనులు చేయిస్తుండగా విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో కాంట్రాక్టర్ ఆవేశానికి లోనై రైతులపై దాడి చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దూరు శివారులోని సర్వే నంబర్ 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో అప్పటి ప్రభుత్వం 40 మంది నిరుపేద రైతులకు జీవనోపాధి కోసం అందించాయి.

జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో అప్పటి మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి రైతులకు సమాచారం ఇవ్వకుండానే 36 ఎకరాల స్థలాన్ని కళాశాలకు కేటాయించారు. దీంతో తమ భూములను తీసుకోవద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో రైతులతో కేటీఆర్ మాట్లాడి నష్టపరిహారంతో పాటు వాణిజ్య, వ్యాపారానికి సంబంధించిన భూములలో మనిషికి 800 గజాల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి కళాశాలను అఘమేఘాల మీద నిర్మించారు. కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని తీర్మానం చేసుకోని మూడు నెలల నుంచి పనులను అడ్డుకుంటూ వస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి రాగా రైతులు అడ్డుకున్నారు.

దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని అప్పటి ఆర్డీవోను ఆదేశించగా ఆర్డీవో ఆ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టపరిహారంతో పాటు స్థలాలు ఇస్తామంటూ సర్వేయర్‌తో సర్వే చేయించి వదిలేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అప్పటి ఆర్డీవో బదిలీపై వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆర్డీవో వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో పాటు సోమవారం కాంట్రాక్టర్ తిరిగి పనులను ప్రారంభించగా రైతులు పనుల ను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం అందించడంతో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల సమస్యలు విన్న సీఐ రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం రాలేదని విషయం తెలుసుకోని రైతులను పంపించి వేశారు. దీనిలో భాగంగానే బుధవారం తిరిగి పనులను చేస్తుండగా రైతులు అడ్డుకొని పనులను నిలిపివేయించడంతో పాటు రిలే నిరహారదీక్షలు కూడా చేస్తామంటూ ఆందోళన చేపట్టారు. సాయంత్రం కాంట్రాక్టర్ మెడికల్ కళాశాల పనుల వద్దకు చేరుకోని ఆందోళన చేస్తున్నా రైతులపై దాడి చేయడంతో రైతులు ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

నష్ట పరిహారం కోసం న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్న తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 10: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై స్వామివారల విహారం



నెమలి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో పార్వతీ రాజ రాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు నెమలి వాహనం పై విహరించారు. రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం పార్వతి రాజరాజేశ్వరస్వామి, సీతా రామచంద్రస్వామి వారలకు పూజలు నిర్వహించారు. రాత్రి పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: రేషన్ బియ్యం అక్రమంగా రైస్‌మిల్‌కు తరలించిన కేసులో నిందితులైన గోపాల్‌పూర్ రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య, రైస్‌మిల్ యజమాని మొగసాల సంతోష్‌రెడ్డి, ఆటో యజమాని, డ్రైవర్ ఊరడి మధులను బుధవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ రేషన్ డీలర్ అంజయ్య పేదలకు పంపిణీ కోసం వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని దుర్శేడ్‌లోని శ్రీ వెంకటేశ్వర మినీ రైస్‌మిల్‌కు తరలించి విక్రయించే యత్నంలో సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచి, రూరల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీనిపై మంగళవారం కేసు నమోదు కాగా నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డిపేట శివారులోని సంచార జీవుల గుడిసెలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనపర్చుకున్నామని పోలీసులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో గుడిసెలో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గుడిసెలో నివసిస్తున్న వ్యక్తులు పారిపోయారని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 13 మంది వాహనదారులను బుధవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఇద్దరు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 4,500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. మిగతా 11 మంది వాహనదారులకు 21 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సికింద్రాబాద్‌లో యువకుడి ఆత్మహత్య



సాయితేజ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలం దుమాల గ్రామానికి చెందిన సాయితేజ (19) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సికింద్రాబాద్‌లో అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని పాముల వనిత-సంతోష్ గౌడ్‌కు ముగ్గురు కొడుకులు బన్నీ, సాయితేజ, అరవింద్ ఉన్నారు. సంతోష్ గౌడ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సంతోష్‌గౌడ్ పదేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వనిత తన ముగ్గురు పిల్లలతో కలిసి ఉపాధి నిమిత్తం యేడాది కిందట సికింద్రాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సాయితేజ మానసికంగా ఆరోగ్య పరిస్థితి బాగలేక పోవడం వల్ల అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచా రం అందుకున్న అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

తల్లితో కలిసి ఉండడం నచ్చకే పినతండ్రి హత్య



హంతకుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మల్లాపూర్, ఏప్రిల్, 10: తల్లితో కలిసి పినతండ్రి అంబదాస్ ఉండటం నచ్చక కోపంతో తనయుడు కందెం రవితేజ హత్య చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హంతకుడు రవితేజను మల్లాపూర్ నంది విగ్రహం నుంచి వెళ్తుండగా అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. మల్లాపూర్ దుర్గమ్మకాలనీకి చెందిన అంబదాస్ (54) తన రెండో భార్య అయిన భోజమ్మతో పాటు ఆమె కుమారుడు కందెం రవితేజతో కలిసి పదిహేనేళ్ల నుంచి నివాసం ఉంటున్నారన్నారు. రవితేజ చిన్నతనంలోనే తండ్రి రమేష్ మరణించగా భోజమ్మ కుమారుడు రవితేజతో కలిసి అంబాదాస్‌తో మల్లాపూర్‌లోని దుర్గమ్మ కాలనీలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తన తల్లి భోజమ్మ సంపాదించిన డబ్బులను అంబదాస్ వాడుకుంటున్నాడని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. రవితేజ పని చేయకుండా జల్సాగా తిరుగుతుండగా పినతండ్రి అయిన అంబదాస్ మందలించేవాడని ఇలా చాలా రోజు నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. అప్పటి నుంచి జల్సాలకు అడ్డుగా ఉన్నాడని భావించి అంబాదాస్‌ను చంపాలని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. దీంతో రవితేజ స్నేహితుడి ఇంటికి వెళ్లి మామిడి కాయలు కొట్టడానికి కత్తి అవసరం ఉందని తెచ్చుకొని శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడుకొని ఉన్న అంబుదాస్‌పై కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోగా అంబుదాస్ అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమారలు పరిశీలించి కేసు నమోదు చేసుకొని రవితేజను రిమాండ్ తరలిస్తున్నట్లు తెలిపారు.

కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి జరిగే చిన్నహను మాన్ జయంతి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. కొండపైన ఆలయ పరిసరాలు, కోనేరు, మాల విరమణ, క్యూలైన్‌లు ఎస్పీ పరిశీలించారు. వందలాది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం, ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఏఈ లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రాజన్న హుండీ ఆదాయం కోటి 27 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా కోటి 27 లక్షల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. 15 రోజుల వ్యవధిలో భక్తులు స్వామి వారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కోటి 27 లక్షల 78 వేల 950 రూపాయల నగదు, 90 గ్రాముల బంగారం, తొమ్మిది కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఉద్యోగులు, శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మణిదీప్ (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 10: ప్రేమించిన యువతితో ఏర్పడిన మనస్పర్థలతో విడిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రామన్నపేటకు చెందిన వకుళాభరణం మణిదీప్ (31) ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మరింది. వారి ప్రేమలో మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెందిన మణిదీప్ గత ఫిబ్రవరిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మళ్లీ మంగళవారం రాత్రి ఇంట్లోని వంట గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



నజీర్ (ఫైల్)

ముస్తాబాద్, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లలో నివాసముంటున్న ఎండీ నజీర్ (42) ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఎండీ నజీర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ అనా రోగ్య కారణంతో ఉండలేక తిరిగి వచ్చాడు. తాగుడుకు బానిసైన నజీర్ ఆర్థికస్థితి బాగాలేక మనస్తాపంతో గత నెల 24వ తేదీన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం పంపించారు. చికిత్స పొందుతూ నజీర్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి బీజాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన రాజు(49) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలం గట్టుపై ఉన్న గడ్డికోస్తుండగా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ఉంది. చూసుకోకుండా అటువైపు వెళ్లి గడ్డి కోసిన రాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన లింగారెడ్డి

కోరుట్ల రూరల్, మార్చి 10: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి లింగా రెడ్డి (70) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లింగా రెడ్డి కొన్ని రోజులుగా షుగర్‌తో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చికిత్సలో లింగారెడ్డి కాలు వేలును వైద్యులు తొలగించారు. అప్పడి నుంచి నిత్యం లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని ఓ రేకుల షేడ్‌లో ఉదయం ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించి నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకుని పరిశీలన జరిపారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 10: మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు నుంచి దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వైపు వెళ్తున్న కారు బుధవారం అదుపు తప్పి సమీపంలోని పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్లకు చెందిన వేణు అతని కుమారునికి గాయాలైనట్లు తెలిసింది. గాయాలపాలైన వారిని పోలీసులు చికిత్స నిమ్మిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులకు రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చెరువులో పడి వన్యప్రాణి మృతి



నీటిలో మృతి చెందిన మనుబోతు

వీర్నపల్లి, ఏప్రిల్ 10: చెరువులో పడి వన్యప్రాణి మృతిచెందిన సంఘటన మండలంలోని రంగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామశివారులోని ఆటవీ ప్రాంతం నుంచి మార్గండి చెరువులో నీరు తాగడానికి వచ్చిన మనుబోతు అందులో పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ సెక్షన్ అధికారి పద్మలత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన మనుబోతు కళేబరాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పశుసంవర్ధక సిబ్బందితో పంచనామా నిర్వహించి కళేబరాన్ని దహనం చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

రాయికల్, ఏప్రిల్ 10: మండలంలోని అల్లీపూర్, కిష్టంపేట, ఉప్పుమడుగు, అయోధ్య, కుమ్మరిపెల్లి, రాయికల్, ఇటిక్యాల, రామాజీపేట, మైతాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను పరిశీలించి, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం తదితరులు ఉన్నారు.

నేషనల్ అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్‌గా శంకర్


శంకర్

రాయికల్, ఏప్రిల్ 10: బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్‌గా రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్‌ను నియమిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రంగాల్లో ఎంతో మంది కృషి చేసి నప్పటికీ వారికి సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రంగాల్లో సేవలు చేసినవారికి అకాడమీ ద్వారా నేషనల్ అవార్డుతో గుర్తింపు లభిస్తుందన్నారు.

హార్వెస్టర్ యజమానులకు అవగాహన

భీమారం, ఏప్రిల్ 10: మండలంలోని లింగంపేట, భీమారం గ్రామాల్లో బుధవారం హార్వెస్టర్ యాజమానులు, డ్రైవర్లకు ఏఈవో సురేందర్ నాయక్, నరేందర్‌లు ఆర్‌పీఎం గురించి అవగాహన కల్పించారు. హార్వెస్టర్ బ్లోయర్ ఆర్‌పీఎం 18-19 పెట్టడంతో నాణ్యమైన ధాన్యం వస్తుందని, దీంతో ఆ ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని వివరించారు. కోసిన వరి ధాన్యాన్ని రైతులు తమ కల్లాల వద్దనే ఆరబెట్టుకుని ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలు లోబడి వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

ఆయోడిన్ లోపంతో పిల్లల్లో దృష్టి సమస్యలు

గొల్లపల్లి, ఏప్రిల్ 10 : ఆయోడిన్ లోపం వల్ల 6 నుంచి 12 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లల్లో దృష్టి మందగిస్తుందని సీహెచ్‌వో గట్ల శ్రీధర్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం గోవిందుపల్లె, గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 6 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సున్న 90 మంది చిన్నారులకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో ఆయోడిన్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆయోడిన్ శరీరానికి అందకపోతే పిల్లల్లో దృష్టి లోపం సంభవిస్తుందని, పిల్లల్లో చలాకీతనం, శారీరక ఎదుగుదల నిలిచి పోతుందన్నారు. ఆయోడిన్ లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నరేందర్, రమేష్, శారద, ఏఎన్ఎమ్‌లు రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రేశ్వర స్వామి జాతర

మల్లాపూర్, ఏప్రిల్, 10: మండలంలోని సాతారం గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను పురోహితుడు శివకుమార్‌శర్మ జరిపారు. అనంతరం భక్తులచే హోమం తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం బోనాలతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గున్నల శ్రీనివాస్, తాజామాజీ సర్పంచు బొడ్డు సుమలత-రాజేష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతార్ల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు బాలుసురెడ్డి, కోశాధికారి జంబుక రమేష్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 10: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాకర్లను బుధవారం కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పూడూర్ గ్రామంలో ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏఎంసీ మాజీ డైరక్టర్‌కు పరామర్శ

కథలాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని దూలూరుకు చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేడిపల్లి రాజరెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బుధవారం వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా నల్ల గంగాధర్, మిట్టపల్లి శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోరుట్ల, మార్చి 10: పట్టణంలోని మార్కెట్ యార్డు పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులలో విటమిన్ లోపాలను గుర్తించి వాడే మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంబటి భూమేశ్వర్, ఉపాధ్యాయులు, ఆర్యో సిబ్బంది భారత్ కుమార్, వరలక్ష్మి, బాలమణి, కావ్య రాజేశ్వరి ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

వెల్గటూర్, ఏప్రిల్ 10: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తద్వారా వారు శారీరకంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాళు పేర్కొన్నారు. వెల్గటూర్ అంగన్‌వాడీ కేంద్రాలలో బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సరైన పోషణ, ఆరోగ్యం అభివృద్ధి గురించి తల్లులకు వివరించారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలకు అభివృద్ధి ప్రణాళిక కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, శంకరమ్మ, భాగ్యలక్ష్మి, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

'అంజన్న సన్నిధిలో కాంగ్రెస్ నేతల అబద్ధాలు'

కొడిమ్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజన్న సన్నిధిలో అబద్దాలు ఆడితే అధికారం గల్లంతేనని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ ఏమీ చేయలేదనటం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తగదన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి 12వేల కోట్ల రూపాయల నిధులు తీసకవచ్చాడన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అంజన్న ఆలయ అభివృద్ధికి 100 కోట్ల రూపాయలను ఇస్తానని రూపాయి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎంత వరకు నెరవేర్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బుచ్చిరాములు, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, నరేష్, సాయిబాబ, తిరుపతిగౌడ్, వెంకట్‌రావు, ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.

ధర్మపురి మండల అంబేడ్కర్ జయంతి కమిటీ ఏర్పాటు

ధర్మపురి, ఏప్రిల్ 10: ధర్మపురి మండల అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చిలుముల లక్ష్మణ్‌ను నియమించారు. స్థానిక శ్రీ కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో అంబేడ్కర్ కమిటీ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించి, జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దుర్గం రవీందర్, ఉపాధ్యక్షులుగా మొలుగూరి రమేష్, జంజిరి కాని భరత్, సంయుక్త కార్యదర్శిగా పసుల బుచ్చన్న, కుంటాల రాజ మల్లయ్యను ఎన్నుకున్నారు. కోశాధికారిగా గంధం రమేష్, ప్రచార కార్యదర్శిగా దేవి అంజి, గౌరవ అధ్యక్షులుగా పారుపెల్లి రాజమల్లయ్య, రాగుల కాంతయ్య, ముఖ్య సలహాదారుగా కట్ట భువనేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆరపేటలో ఇఫ్తార్ విందు

మెట్‌పల్లి, ఏప్రిల్, 10: పవిత్ర రంజాన్ పండుగ సర్వ మానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన ఆరపేటలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవరెడ్డి, వెల్డి శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో నియమనిష్ఠలతో రంజాన్ ఉపవాసాలు ఉంటారని ఆధ్యాత్మికంగా ప్రవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు రాజోజి సదానందచారి, ముఖీమ్, విజయ్‌పటేల్, నాగభూషణం పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిసరాల్లో పుర్రె కలకలం

రాయికల్, మార్చి 10: జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ పరిధిలోని శ్మశాన వాటిక వెళ్లె దారిలో మానవుడి పుర్రె కలకలం రేపింది. రాయికల్ పట్టణ శివారులో బుధవారం అంత్యక్రియలకు వెళ్లిన వారికి శ్మశానానికి వెళ్లే దారిలో అసంపూర్తిగా కాలిన పుర్రె కనిపించింది. రెండో రోజుల క్రితం రెండు మృతదేహాలు అంత్యక్రియలు శ్మశాన వాటికలో నిర్వహించంగా పూర్తిగా కాలని పుర్రెను కుక్కలు లాక్కొచ్చి శ్మశాన వాటిక రహదారిలో పడేసినట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయం పట్టణంలో ప్రచారం జరుగగా సంచలం రేపింది. దీంతో మున్సిపల్ అధికారులు విషయం తెలుసుకుని పుర్రెను అక్కడినుంచి తీయించి దహన సంస్కారాలు నిర్వహించారు.

ఓట్ల కోసం బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలు

● బండి సంజయ్ , వినోద్ కుమార్ చేసిన అభివృద్ధి శూన్యం
● రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


కొండగట్టులో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం

మల్యాల, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ డ్రామాలకు తెరలేపారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా పనిచేసిన వినోద్‌కుమార్, బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. తాను ఎంపీగా చేసిందే తప్ప మరేమీ లేదని ఒకవేళ వాళ్ల అభివృద్ధి చేస్తే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం రామ జపం చేస్తూన్నారే తప్ప ఏమి అభివృద్ధి చేశారో చెప్పి ప్రజలను ఓట్లు అడుగాలని బండి సంజయ్‌కు సూచించారు. ఎంపీగా కొండగట్టు, వేములవాడ దేవస్థానాల అభివృద్ధి పట్టించుకోలేదని కనీసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో కూడా చేర్చడానికి చర్యలు తీసుకోలేదని మంత్రి విమర్శించారు. బండి అవినీతిపై విచారణ జరుపుతామని అన్నారు. బీఆర్ఎస్ నిట్టనిలువును కూలిపోయిన పార్టీ అన్నారు. సామాన్యులను కలవకుండా కారు దిగని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ ఎక్కడి నుంచో వచ్చి ప్రస్తుతం ఎన్నికల కోసం మార్నింగ్ వాక్ చేయడం ప్రజలను మభ్య పెట్టాడానికే అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన చోట ఓట్లు అడుగాలని తాము ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోట మాత్రమే ఓట్లు అడుగుతామని అన్నారు. కవిత అరెస్ట్‌తో కేసీఆర్ ఎన్నికల్లో సానుభూతి కోసం ఆరాటపడుతున్నాడని ఇదంతా రాజకీయ డ్రామాగా మంత్రి అభివర్ణించారు.ఎమ్మెల్సీ కవిత కొండగట్టు అభివృద్ధి చేస్తానని మాట తప్పడంతోనే జైలు పాలు అయిందని పేర్కొన్నారు. కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదం జరిగి అనేక మంది చనిపోతే కనీసం పరామర్శించని కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించాలని అన్నారు. సమావేశంలో నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్ గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, లక్ష్మణచారి, నర్సింహారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, చెర్ల పద్మ, అజ య్, బుర్ర అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు

●ఎన్నికల ప్రచారం ప్రారంభం

కాంగ్రెస్ కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. లోక్‌సభ పరిధిలోని చొప్పదండి, వేములవాడ, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వాయి సన్నిదిలో ప్రత్యేక పూజలు చేసి గ్రామస్థాయి నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతకు ముందు మంత్రి అంజన్న సన్నిధిలో గత ఎన్నికల ముందు గెలుపు కోసం కట్టిన ముడుపు విప్పి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

● మై విలేజ్‌షో ఫేం గంగవ్వతో మంత్రి

లంబాడిపల్లిలో మై విలేజీషో ఫేం గంగవ్వను మంత్రి పొన్నం ఎమ్మెల్యేలు సత్యం, శ్రీనివాస్, సత్యనారాయణలతో కలిశారు. ఆమె యోగక్షేమాలు తెలుసుకొని సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలోనే కలిపిస్తానని అన్నారు. ఈ సందర్భంగా లంబాడిపల్లితో పాటు పక్క గ్రామాల మధ్య నెలకొన్న రెవెన్యూ హద్దుల గురించి గంగవ్వ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. గంగవ్వను కూడా కలెక్టర్‌తో మాట్లాడించారు. అనంతరం మై విలేజీషో టీంను మంత్రి, ఎమ్మెల్యే సత్కరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి విద్యార్థిని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థిని

రాయికల్, ఏప్రిల్ 10: రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో తమ ఇంటి ఎదుట ఉన్న డ్రైనేజీలో మురికితో నిండి దుర్వాసన వస్తోందని విస్డమ్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న మనహా ముబీన్ అనే విద్యార్థి బుధవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేసింది. తమ కాలనీలో డ్రైనేజీ సమస్య వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీంతో పాటు పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని, డ్రైనేజీ వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొంది. ఈ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపినట్లు విద్యార్థి పేర్కొంది.

ముగిసిన శ్రీ గుండు మల్లన్న స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

గొల్లపల్లి, ఏప్రిల్ 10: గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీ గుండు మల్లన్న స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మల్లన్న స్వామికి బెల్లం పానకంతో వండిన బోనాలను మహిళలు నెత్తిన ఎత్తుకుని ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లన్న స్వామికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గర్భగుడిలోని స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు సింహాచలం శ్రీనివాసా చార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారికి అభిషేకాలు, నిత్యపూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పట్నాలు, అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

తిర్మలాపూర్ (పీడీ) గ్రామంలోని శ్రీ గుండు మల్లన్న స్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, నాయకులు భీమ సంతోష్, క్యాస గంగాధర్, జెల్లా అనిల్ కుమార్ యాదవ్, మహేందర్, గాదే ఆంజనేయులు, లచ్చయ్య, రామస్వామి పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్‌దే


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కోరుట్ల, మార్చి 10: రాష్ట్రంలో 200 యున్నిట్ల ఉచిత విద్యుత్ అందించిన విధంగా దేశంలో ఉచిత విద్యుత్ అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ గుండోజీ శ్రీనివాస్, పుప్పాల ఉమాదేవి-ప్రభాకర్, గందం గంగాధర్, కోరుట్ల సింగిల్ విండో చైర్మెన్ ఎలిశెట్టి భూంరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త బూర్గు రామాస్వామి గౌడ్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌తో కలిసి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడారు. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధిపై గతంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావుతో పోటీ పడ్డామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఫిల్లర్‌బెడ్ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఫిల్లర్‌బెడ్‌ను అభివృద్ధిలోకి తీసుకువస్తామని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇప్పించే విధంగా కృషి చేస్తామని, వరికి రూ.450 ఉన్న మద్దతు ధర మూడు రేట్లు పెరగిందని వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి శూణ్యమన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీలోకి కొత్తవాళ్లు వచ్చినా పాతవాళ్లకు ఉన్న గౌరవం తగ్గదని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడూత ఎవరూ ఆపదలో ఉన్నా నేనున్నానంటూ జీవన్‌రెడ్డి అందుబాటులో ఉంటారని అన్నారు. రత్నాకర్‌రావు, జీవన్‌రెడ్డి మంత్రులగా ఉన్న సమయంలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చేసారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, నాయకులు కొంతం రాజం, ఆడెపు మధు, జలపతిరెడ్డి, ఏలేటి మహిపాల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వెంకటేష్ గౌడ్, మ్యాకల నర్సయ్య, నయిం, చెదలు సత్యనారాయణ, ప్రతాప్ పాల్గొన్నారు.

అమరవీరుల పోరాటం స్ఫూర్తిదాయకం

● బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం భరతమాత ఒడిలో ప్రాణాలు వదిలిన అమరవీరులు రామన్న, గోపన్న, జిత్తన్న, మాదన్నల పోరాటం స్ఫూర్తిదాయకమని బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని వీకేబీ గార్డెన్స్‌లో నిర్వహించిన రామన్న, గోపన్న, మదన్న, జితేందర్ రెడ్డి అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామన్న, గోపన్న, మదన్న, జితేందర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏబీవీపీలో చురుకైన విద్యార్థి నాయకుడిగా ఎదిగి 1984లో బీజేపీ జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన జితేందర్‌రెడ్డి తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందాడన్నారు. జితేందర్‌రెడ్డి ఎదుగుదలను జీర్ణించుకోలేని నక్సలైట్లు 1987 ఏప్రిల్ 9వ తేదీన బలిగొన్నారన్నారు. అమరులు భౌతికంగా లేకున్నప్పటికీ వారి ఆశయాలు, ఆశలు చిరకాలంగా ప్రజల మనస్సుల్లో నిలిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి, రాచకొండ శ్రీరాములు, ఏసీఎస్ రాజు, జిదిగే పురుషోత్తం, రామలింగారెడ్డి, మహేశ్, వీర గోపాల్, మురళీ, శంకర్, ప్రసాద్ రావు, సంపూర్ణచారీ, సత్యనారాయణ, రవీందర్, లింగంపేట శ్రీనివాస్, పోచమల్లు, ఉమ రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, బాల కృష్ణ, భిక్షపతి, కిషన్, బాలయ్య పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి, ఏప్రిల్ 10 : గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ కాసారపు రాయలింగ్ గౌడ్‌ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వివరాలు అడిగితెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని రంగదాముని పల్లె గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న శ్రీనివాస్ అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను ఆయన పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, తాజామాజీ సర్పంచ్‌లు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, నాయకులు భీమ సంతోష్, కాసారపు అరవింద్ గౌడ్, జెల్ల అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

కంటి వైద్య శిబిరం

పెగడపల్లి, ఏప్రిల్ 10: పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం విజయవంతమైంది. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించారు. 9 మంది విద్యార్థినిలకు కంటి శస్త్ర చికిత్స అవసమున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మండల వైద్యాదికారి డాక్టర్ నరేష్, డాక్టర్ పర్హానా, ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి, ప్రిన్సిపాల్ సునీత ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పెగడపల్లి, ఏప్రిల్ 10: పెగడపల్లి మండల కేంద్రంలో నలుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జాడి రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీ చేపట్టగా బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద నిషేధిత నాలుగు వందల గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఈ మేరకు గంజాయి విక్రయించడానికి వచ్చిన బైర కల్యాణ్, దోమలకుంట, రాథోడ్ అర్జున్, బోథ్ మండలం నిగిరి గ్రామం ఆదిలాబాద్ జిల్లా, రాథోడ్ దేవ, నిర్మల్ జిల్లా రాయదరి గ్రామం, జాదవ్ కిషన్, నిర్మల్ జిల్లా రాయదరి గ్రామంగా పేర్కొన్నారు. వారిని అరెస్టు చేసి నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల

మెట్‌పల్లి, ఏప్రిల్, 10: కోరుట్ల నియోజకవర్గంలోని పంటల కోసం ఎస్సారెస్పీ నీటిని అధికారులు బుధవారం విడుదల చేశారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు తెలిపారు. దీంతో స్పందించిన కృష్ణారావు సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ నీటి విడుదలపై సంతోషం వ్యక్తం చేశారు. నీటి విడుదలకు ప్రధాన పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నీటితో చివరి దశలో ఉన్న పంటలు పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కొట్టల రవి, లోలప్ అంజయ్య, కందుల లక్ష్మణ్, నాయకులు పుల్లూరి వెంకటేష్, నాగిని సురేష్, బొడ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణానగర్‌లో గల అల్ఫోర్స్ స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. అల్ఫోర్స్ పాఠశాలల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఆలపించిన ప్రత్యేక పద్యాలు, గీతాలు, రైమ్స్, నృత్యాలు పలువురి ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ పాఠశాలల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు బాల్య దశ నుంచే పలు విషయాల పట్ల అవగాహణ కల్పించాలని, వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని తద్వారా పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ప్రాథమిక విద్య చాలా విలువైనదని, భవిష్యత్తుకు పునాదిలాంటిదన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతీ సంవత్సరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రధానం చేసి ఘనంగా సత్కరించి మూడో తరగతికి ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగలకు ఎంపీ సీటు కేటాయించలేదని నిరసన



ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మపురి, ఏప్రిల్ 10: తెలంగాణలో ఉన్న 17 పార్లమెంట్ స్థానాల్లో ఒక సీటు కూడా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కేటాయించడం లేదని ధర్మపురి మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాట్లాడుతూ మాదిగలను అణగదొక్కేందుకే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మాలల పార్టీగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ధర్మపురి మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పారిపెల్లి లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి బరిగెల ప్రసాద్, కార్యదర్శి దూడ లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి మామిడిపెల్లి గణేష్, రాయిల్ల రవికుమార్, సాంస్కృతిక కార్యదర్శి జిల్లపెల్లి లింగన్న, వివిధ గ్రామాల అధ్యక్షులు జిల్లపెల్లి భీమయ్య, మొరుగంటి దినేష్, అంతర్పుల రాజన్న, బత్తిని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చాలని వినతి

బీర్‌పూర్,ఏప్రిల్ 10: భారతీయ రాష్ట్ర సమితి పేరును మార్చి, మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)గా పార్టీ పేరునే కొనసాగించాలని కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు బీర్‌పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రామకిష్టు గంగాధర్, కొంత మంది కార్యకర్తలు కలిసి పార్టీ పేరును టీఆర్ఎస్ పార్టీగానే కొనసాగించేలా చూడాలని వినతి పత్రం సమర్పించారు.

ప్లంబర్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి, ఏప్రిల్, 10: పట్టణంలోని ప్లంబర్ యూనియన్ ఎన్నికలను సభ్యులు బుధవారం నిర్వహించుకున్నారు. నూతన అధ్యక్షుడుగా ఆగ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సోమిడి మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు సభ్యులు తెలిపారు. నూతనంగా ఎన్నికైనా కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారిని ఎన్నుకున్న సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్మపురి : పట్టణంలోని గిరుకల కాలనీలో గుర్రాల గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.